సాక్షి నారాయణపేట

శుక్రవారం । 5 । జూలై । 2024



అట్టహాసంగా పోటీలు

బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



ఫిల్టర్ ఇసుక తయారీ

గుట్టుగా సాగుతున్న ఫిల్టర్ ఇసుక వ్యవహారం గద్వాలలో వెలుగులోకి వచ్చింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.2 /24.2

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రివేళలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

11 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

నారాయణపేట రూరల్: ఈ విద్యా సంవత్సరంలో మొదటి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఈ నెల 11 నుంచి ప్రారంభిస్తున్నట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఎస్‌జీటీ టీచర్లు ఈ నెల 11న స్కూల్‌లో పనిచేస్తున్న సగం మంది టీచర్లు, 12న మిగితా సగం మంది పాల్గొనాలని సూచించారు. అదేవిధంగా యూపీఎస్, హైస్కూల్‌లలో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, పండిత్‌లకు సంబంధించి 15న తెలుగు, గణితం టీచర్లు, 16న హిందీ, బయాలజీ, 17న ఇంగ్లీష్, ఫిజిక్స్, సోషల్ టీచర్లు హాజరుకావాలని చెప్పారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సమావేశాలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతి, లక్ష్య తదితర కార్యక్రమాలపై కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు.

ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నారాయణపేట రూరల్: ప్రతి పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐలకు అనుబంధంగా ఉండి పీఎస్‌ను చక్కగా నిర్వహించేందుకు రిసెప్షనిస్టుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని.. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎస్పీ యోగేష్‌గౌతమ్ అన్నారు. జిల్లాలోని అన్ని పీఎస్‌లలో విధులు నిర్వహిస్తున్న రిసెప్షనిస్టులతో గురువారం వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీఎస్‌లో 5 ఎస్ విధానం తప్పకుండా అమలు చేయాలన్నారు. పరికరాలు క్రమ పద్ధతిలో ఉంచాలని, సమయపాలన పాటించాలన్నారు. వృత్తిపట్ల నిబద్ధత, విధేయత చూయించాలని, రికార్డులు, ఫైల్స్, సర్క్యులర్స్ నిర్దేశిత ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు బందోబస్తు టీమ్‌లను ఏర్పాటు చేయాలని, డ్యూటీ చార్ట్ తయారు చేయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా, అందరిని సమన్వయం చేస్తు ముందుకు పోవాలన్నారు. సమాచార నివేదికలను సరియైన సమయంలో అందించి దర్యాప్తు నిజాయితీగా పూర్తి చేసేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ పిర్యాదును ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సమావేశంలో డీసీఆర్‌బీ ఎస్‌ఐ సునీత, ఐటికోర్ శ్రీనివాసులు, శ్రీజ, రిసెప్షనిస్టులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

దేవరకద్ర: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం ఈ నెల 10వ తేదీలోగా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జంగం విరూపాక్షప్ప ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ ఎంపీసీఎస్, బీఎస్సీ బీజెడ్‌సీ, బీఎస్సీ బీబీటీసీ, బీకాం సీఏ, బీకాం బీఏ, బీఏ హెచ్‌ఈపీ, బీఏ ఈపీఎస్‌పీఏ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా దేవరకద్ర వెంకటసాయి కళాశాల భవనంలో ఉన్న డిగ్రీ కళాశాల కార్యాలయంలో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

పారదర్శకతే లక్ష్యం

మీ సేవ కేంద్రాల్లో నగదు రహిత చెల్లింపులు



క్యూఆర్ కోడ్‌పై జిల్లా కేంద్రంలో మీసేవ నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న ఈడీఎం విజయ్‌కుమార్(ఫైల్)

- అందుబాటులోకి క్యూఆర్ కోడ్ సేవలు
- చేతివాటం లేకుండా చర్యలు
- ఆన్‌లైన్ ద్వారా ఫీజుల చెల్లింపులు

మద్దూరు: మీ సేవ సెంటర్లలో పారదర్శకత చెల్లింపులకు ప్రభుత్వం సాంకేతికతను అందుబాటలోకి తీసుకువచ్చింది. మీ సేవల్లో చేతివాటం లేకుండా క్యూఆర్ కోడ్ పద్ధతిని అమలు చేస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లో వ్యత్యాసానికి తావు లేకుండా మీ సేవ, టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల్లో నగదు రహిత లావాదేవీలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈ నెల 1 నుంచి క్యూ ఆర్ కోడ్ ద్వారా ఫీజులు తీసుకుంటున్నారు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

350 రకాల సేవలు..

రాష్ట్ర ప్రభుత్వం మీసేవ, టీఎస్ ఆన్‌లైన్ సెంటర్లలో క్యూఆర్ కోడ్ పద్ధతిని అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలో 65 మీసేవ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాల ద్వారా 350 రకాలకు పైగా సేవలను అందిస్తున్నారు. ఇందులో మొదటగా రెవెన్యూ సర్వీసెస్ కేటగిరీలోని 42 సేవలను క్యూఆర్ కోడ్‌పద్ధతిలో ఫీజుల చెల్లింపులకు ట్రయల్ రన్ ప్రారంభించారు. మూడు నుంచి ఆరు నెలల పాటు సక్సెస్ రేటును ప్రామాణికంగా తీసుకుని మిగితా 308 రకాల సేవలను సైతం ఇందులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం రెవెన్యూ పరిధిలో ఉన్న కమ్యూనిటీ అండ్ డేట్ ఆఫ్‌బర్థ్, నేటివిటీ,



మద్దూరులోని మీ సేవ కేంద్రం

ఆర్పనేజ్ ఇంటిగ్రేటెడ్(అప్లికేషన్), లైసెన్స్ పొందిన సర్వేయర్ల దరఖాస్తు ఫారం, నివాస ధ్రువీకరణ, ఆదాయ, వ్యవసాయ, ఈ బీసీ, ఓబీసీ, కుటుంబ సభ్యులు, పాన్ బ్రోకర్, మనీ లాండింగ్, నో ఆబ్జక్షన్, ఎన్‌ఎఫ్‌బీఎస్ అప్లికేషన్, అపద్బాంధు స్కీం, సీసీఆఫ్‌రామ్, పోజీషియన్, సన్నకారు రైతు రిజిస్ట్రేషన్, ఆయుధ లైసెన్స్ జారీ, ఎక్స్‌ప్లోజివ్ మెటీరియల్ లైసెన్స్/క్రాకర్ స్టోరేజ్ తదితర సర్టిఫికెట్లకు సంబంధించి అప్లికేషన్ ఫీజులతో పాటు ఇతర నగదును ఇక నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి క్యూఆర్ కోడ్ అమలు తీరు తెన్నులను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఈ- డిస్ట్రిక్ మేనేజర్ విజయ్‌కుమార్ అధ్వర్యంలో మీ సేవ కేంద్రాల నుంచి.. ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు.

తగ్గిన దరఖాస్తులు..!

జిల్లాలో రెవెన్యూ సంబంధించి అప్లికేషన్లకు క్యూఆర్ ద్వారా చెల్లింపులు చెయాల్సి రావడంతో దరఖాస్తు దారుడి (ఫోన్ పే, గూగుల్‌పే తదితర యాప్‌లు) ద్వార చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి ఫోన్ పే, గూగుల్ పే యాప్‌లు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. దీనికి ప్రతి రోజూ జరగాల్సిన ఆన్‌లైన్ దరఖాస్తుల కంటే ఈ నెల 1 నుంచి సగానిపైగా దరఖాస్తులు పడిపోయినట్లు మీ సేవ నిర్వహకులు తెలిపారు.

ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నాం..



మీ సేవ సెంటర్లలో రెవెన్యూ సేవలకు సంబంధించి ఇక నుంచి క్యూఆర్ కోడ్‌తోనే చెల్లింపులు చేయాలి. జిల్లాలోని 65 మీసేవ కేంద్రాల్లో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నాం. ఇది విజయవంతమైతే మీ సేవ పరిధిలోని మిగితా 308 సేవలను సైతం క్యూఆర్ కోడ్ ద్వార చెల్లించే విధంగా సేవలను అందుబాటులోకి తీసుకువస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సేవలకు కొంత అంతరాయం జరుగుతున్న మాట వాస్తవం.

– విజయ్‌కుమార్, ఈడీఎం, నారాయణపేట.

చేతివాటం లేకుండా..

మీసేవ, టీఎస్ ఆన్‌లైన్ సెంటర్లలో అదనపు వసూళ్లు లేకుండా క్యూఆర్ కోడ్ సిస్టంను అమలు చేస్తున్నారు. ఆయా సర్టిఫికెట్లు జారీ చేసే క్రమంలో అందుకు సంబంధించిన ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం ఆన్‌లైన్ ద్వార చెల్లిస్తే సరిపోతుంది. అప్లికేషన్ ప్రాసెస్ పూర్తయిన వెంటనే.. సదరు సెంటర్ నిర్వాహకుడి కూంప్యూటర్‌లో ఫీజుకు సంబంధించి క్యూఆర్ కోడ్ వచ్చిన వెంటనే, దరఖాస్తుదారులు దాని ద్వారా నగదు చెల్లించాలి. ఇదిలా ఉండగా అప్లికేషన్ కాపీతో కలుపుకొని 5 పేజీల వరకు(రెండు సైడ్‌లు ఉంటే రెండున్నర పేజీలు) ఫీజు రేటులోనే స్కానింగ్ చేయాల్సి ఉంటుంది. అంతకు మించి పేజీకి రూ.2 చొప్పున అదనంగా ఇవ్వాలి.

ప్రజల మన్ననలు మించిన గౌరవం లేదు..



జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, జెడ్పీటీసీలు, ఎంపీపీలను సన్మానించిన అధికారులు

నారాయణపేట: ఇన్నాళ్లు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించిన ప్రజాప్రతినిధులు వారి మన్ననలు పొందారని.. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పదవీ కాలం పూర్తయినా ప్రజల గుండెల్లో ఉంటారని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం జిల్లా కేంద్రం సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ వనజ అధ్యక్షతన జెడ్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈరోజు పదవీకాలం పూర్తి చేసుకొని జెడ్పీటీసీలు, ఎంపీపీలు వదిలి వెళ్లడం బాధాకరంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మంచి అవకాశాలు వస్తాయని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. జిల్లాలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం రాబోయే రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నా రు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, ఏ సమస్య ఉన్న సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

- అంతకుముందు వ్యవసాయ శాఖ, విద్యుత్, విద్య, వైద్య ఆరోగ్య శాఖలు వారి ప్రగతిని సభకు వినిపించారు. ఊట్కూరు పీహెచ్‌సీలో డాక్టర్ లేరని జెడ్పీటీసీ అశోక్ గౌడ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. నర్వ మండలానికి అంబులెన్స్ మంజూరు చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి అన్నారు. ఊట్కూరు కెనాల్ రిజర్వాయర్ స్టోరేజ్ కావాలని కోరారు.
- అనంతరం జెడ్పీచైర్ పర్సన్ వనజ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు మాట్లాడుతూ తమకు ఐదు సంవత్సరాలు పాటు సహకరించిన అధికారులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జెడ్పీచైర్‌పర్సన్ వనజ, అడిషనల్ కలెక్టర్ మాయాంక్ మిత్తల్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్పర్సన్ గౌని సురేఖ, జెడ్పీటీసీ సభ్యులు వెంకటయ్య, అంజలి, రఘుపతి రెడ్డి, ప్రకాష్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు యంఏ వహీద్, తాజుద్దీన్, ఇంచార్జి జెడ్పి సీఈవో రాజేశ్వరి పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మక్తల్: కళాశాలల్లో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వారికి సహకరించిన వారిపైనా చర్యలు తప్పవని పీపీ న్యాయవాది నాగేశ్వరి, డిప్యూటీ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు దత్తాత్రేయ అన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మక్తల్ మండలం సంగంబండలోని కస్తూర్బాగాంధీ కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను వేధించడం, హింసించడం సరికాదని, ప్రతి పాఠశాలల్లో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా కమిటీలను వేయాలని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, చెడు అలవాట్లు, ఆలోచనలకు దూరంగా ఉండి పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పీపీ అసిస్టేంట్ నాగేశ్వరి, జిల్లా జోగిని వ్యతిరేఖ పోరాట సమితి కన్వీనర్ హాజమ్మతోపాటు రేణుక, కృష్ణవేని, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



మక్తల్‌లో మాట్లాడుతున్న న్యాయవాది నాగేశ్వరి

పాలమూరు అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

- మత రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్
- ఎంపీ డీకే అరుణ

పాలమూరు: కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండా ఇక్కడ ఉన్న వారు ఏమీ చేయలేరని, ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఇకపై కుట్రలు మానుకుని అభివృద్ధికి కలిసి రావాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. పార్లమెంట్‌లో ఎంపీ అభ్యర్థిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత జిల్లాకు రాగా గురువారం బీజేపీ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలో అప్పన్నపల్లి వద్ద శ్రేణులు చేరుకుని స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించి, అక్కడి నుంచి బైక్ ర్యాలీతో పట్టణంలోని అన్నపూర్ణ గార్డెన్‌కు చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు గతంలో ఉన్న బీఆర్‌ఎస్ నేతల మాదిరిగా వ్యవహరిస్తున్నారని, పార్టీ మారాలని వేధిస్తే ఊరుకోనని తెలిపారు. జిల్లాలో భూతగాదాలు కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపించాలన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం సచివాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా తనను దెబ్బతీసే ప్రయత్నం చాలా చేశారని మండిపడ్డారు. తన గెలుపులో గద్వాల జిల్లా ప్రజలు, నాయకుల కార్యకర్తల కృషి కూడా ఉందన్నారు. గద్వాలలో ఏం చేయలేదని తనపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేశారని, పార్లమెంట్‌కు పోవాలనే లక్ష్యంతో గద్వాల నుంచి పోటీ చేయలేకపోయానని తెలిపారు. నాగర్‌కర్నూల్‌లో కూడా బీజేపీ అభ్యర్థి గెలిపించే అవకాశాలు ఉండేనని, స్వల్ప తేడాతో ఓడిపోయామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

టికెట్ రాక ముందు నుంచే కుట్రలు..

హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా రాహుల్‌గాంధీ మాట్లాడటం సరికాదని, అసలు విషయాలు పక్కన పెట్టి మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎంపీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి తనను ఓడించడానికి సర్వశక్తులు ఒడ్డారని, ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు. వ్యక్తిగతంగా, మానసికంగా వేధించారని విమర్శించారు. తనకు టికెట్ రాకముందు నుంచే కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేయడం మొదలుపెట్టారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీ.ఆచారి, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, నాగురావు నామాజీ, శ్రీవర్ధన్‌రెడ్డి, కొండయ్య, ఎగ్గని నర్సింహులు, పడాకుల బాలరాజు, సుదర్శన్‌రెడ్డి, వీర బ్రహ్మచారి, పద్మజారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణపేట అధ్యక్షుడు శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జయశ్రీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేరికపై నిరసన జ్వాలలు



మల్దకల్ బస్టాండ్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ ధర్నా, రాస్తారోకోలు
- టవర్ ఎక్కిన కార్యకర్త.. పెట్రోల్ పోసుకొని మరొకరి ఆత్మహత్యాయత్నం
- గద్వాల నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలు

గద్వాల/గద్వాల క్రైం/కేటీదొడ్డి/మల్దకల్/గట్టు/ధరూరు: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరతారని కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఆయన చేరికను కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ చేరికను అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, తాజా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత బహిరంగంగానే ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. గద్వాల ప్రధాన రహదారి, చౌరస్తాలలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బంగ్లా బంధుత్వం ఉన్న ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని ప్లకార్డులు చేతపట్టి నినదించారు. నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ శ్రేణులు, ఇన్‌చార్జ్‌ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న తమ పరిస్థితి ఏమిటని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి కోసం కాదని, అక్రమ వ్యాపారాల కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బాస్కర్ యాదవ్, కబీర్‌దాస్ నర్సింహా, పులిపాటి వెంకటేష్, జగదీష్, వెంకట్రామిరెడ్డి, తుమ్మల నర్సింహులు, నరహరిగౌడ్, మాలశ్రీను, అనిల్, రాముయాదవ్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ గద్వాల యూత్‌కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రహీం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మరో కార్యకర్త ప్రసాద్ సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఏఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ దాదాపు నాలుగు గంటలపాటు ఆపసోపాలు పడి ఇరువురిని రక్షించారు.



గద్వాలలో పెట్రోల్ పోసుకున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

⇨ కేటీదొడ్డి, మల్దకల్, గట్టులో కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముందుగా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని డిమాండ్ చేశారు. ధరూరులో ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ కాంగ్రెస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు.

నల్లమలలో స్టడీ టూర్

నేడు, రేపు మంత్రి జూపల్లి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల పర్యటన

- ఎకో టూరిజం అభివృద్ధిపై మేధోమథనం
- పాలమూరు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన
- పర్యాటక హబ్‌గా తీర్చిదేద్దేలా ప్రణాళికలు
- సౌకర్యాల కల్పన, స్థానిక యువతకు ఉపాధి కల్పనకు కసరత్తు



నల్లమల్ల అటవీ ప్రాంతం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమలను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అటవీ ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఎకో, టెంపుల్, రివర్ టూరిజం సమూహాల అభివృద్ధితో పాటు వసతుల కల్పనపై కసరత్తు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల బృందం శుక్ర, శనివారాల్లో నల్లమలలో పర్యటించనుంది. రెండు రోజుల స్టడీ టూర్‌లో భాగంగా పర్యాటక అభివృద్ధి, మౌలిక వసతుల ఏర్పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పన వంటి తదితర అంశాలపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయనుంది.

టూరిస్ట్ హబ్‌గా నల్లమల..

దట్టమైన అరణ్యం, పచ్చని చెట్లు, పదుల సంఖ్యలో పెద్దపులులు, వందకు పైగా చిరుతలు, విభిన్న రకాల వన్యప్రాణులతో నల్లమల అభయారణ్యం పర్యాటకులను పెద్దసంఖ్యలో ఆకర్షిస్తోంది. ఓ వైపు నల్లమల అడవి, మరోవైపు కృష్ణాతీరం వద్ద నెలకొన్న సుందరమైన వ్యూ పాయింట్‌లు పర్యాటకులను మంత్రముగ్దులను చేస్తున్నాయి. ఇక్కడి జలపాతాలు, పుణ్యక్షేత్రాలు, వ్యూపాయింట్‌ల కేంద్రంగా ఎకో టూరింజం అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇప్పటికే సలేశ్వరం తీర్థం, లింగమయ్య లోయ దర్శనానికి ఏడాది పొడవుగా పరిమిత సంఖ్యలో పర్యాటకులను అనుమతించేందుకు అటవీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఏపీలోని ఇష్టకామేశ్వరీ అమ్మవారి దర్శనం తరహాలోనే మన్ననూరు నుంచి నిత్యం నిర్ణీత సంఖ్యలో పర్యాటకులను అటవీశాఖ వాహనాల్లో తీసుకెళ్లి సలేశ్వరం లింగమయ్య దర్శనం కల్పించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇదే తరహాలో నల్లమలలోని వివిధ పురాతన ఆలయాలు, సుందర ప్రదేశాలు, జలపాతాలు, వ్యూ పాయింట్ల వద్ద టూరిజం కేంద్రంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశం ఉంది. ప్రధానంగా రోడ్లు, పర్యాటకుల వసతి కోసం కాటేజీలు, హోటళ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఎకో టూరిజం అభివృద్ధి సుగుమం కానుంది. అడవిలో వన్యప్రాణులకు ఆటకం కలగకుండా, వనసంపద సంరక్షణకు చర్యలు తీసుకుంటూనే, పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించడం, వసతులను మెరుగుపర్చడం ద్వారా స్థానిక చెంచు యువతకు ఉపాధి కల్పించడంపై అటవీశాఖ దృష్టి పెట్టింది.



ఆక్టోపస్ వ్యూపాయింట్



ఫర్హాబాద్ వ్యూ పాయింట్

నేటి పర్యటన వివరాలు..

శుక్రవారం ఉదయం అచ్చంపేటలోని ఉమామహేశ్వర స్వామి దర్శనం చేసుకోనున్నారు. మన్ననూర్‌లోని ఈఈసీ, ప్లాస్టిక్ రీసైక్లింగ్ సెంటర్, బయో ల్యాబ్‌ను సందర్శించనున్నారు. ఆ తర్వాత వ్యూపాయింట్, కదలైన వనంతో పాటు భౌరాపూర్ ఆలయం, మల్లెల తీర్థం జలపాతాన్ని సందర్శించి పరిశీలించనున్నారు. అనంతరం వజ్రాల మడుగు, ఆక్టోపస్ వ్యూపాయింట్‌ను సందర్శించనున్నారు.

రేపు ఇలా..

శనివారం ఉదయం శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. ఆ తర్వాత అక్కమాంబ బిలం, రివర్ బోటింగ్‌ను పరిశీలించనున్నారు. అనంతరం మద్దిమడుగు ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు చేయనున్నారు. అక్కడి నుంచి గీసుగండీ రివర్ పాయింట్, గున్నంపేట, రాయలగండి, అంతర్ గంగాతో పాటు మన్ననూర్‌లోని జంగిల్ రిసార్ట్, ప్రతాపరుద్రుడి కోటను సందర్శించనున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కొత్తకోట బైపాస్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రామాంజనేయులు

కొత్తకోట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన బుధవారం రాత్రి కొత్తకోట బైపాస్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివారలు ఇలా ఉన్నాయి. గద్వాల మండలం కొండపల్లికి చెందిన రామాంజనేయులు, సుజాత భార్యాభర్తలు. వీరు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వారి సొంత గ్రామానికి వచ్చిన దంపతులు, తిరిగి హైదరాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో కొత్తకోటలో దిగి అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు రాత్రి 11 గంటల ప్రాంతంలో కొత్తకోట బైపాస్‌లో బస్సుల కోసం రోడ్డు పక్కన వేచి ఉన్నారు. ఈ క్రమంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా రామాంజనేయులును ఢీ కొట్టింది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య



రాజశ్రీ(ఫైల్)

చారకొండ: మనస్తాపానికి గురై పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చారకొండ మండలంలోని సిర్సనగండ్లలో చోటుచేసుకుంది. చారకొండ ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిర్సనగండ్లకి చెందిన రాజశ్రీ(29)కి పది సంవత్సరాల కిందట కృష్ణ జిల్లా ఖమ్మంపాడుకి చెందిన శేషుకుమార్‌తో వివాహమైంది. పిల్లలు లేని కారణంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. మూడు నెలల కిందట భార్యాభర్తలు గొడవ పడటంతో భర్త నుంచి వచ్చి సిర్సనగండ్లలో తల్లిదండ్రులతో కలిసి ఉంటుంది. బుధవారం తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో భర్తతో ఫోన్ మాట్లాడి పురుగు మందు తాగింది. స్థానికులు గమనించడంతో వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆమెను వైద్యం నిమిత్తం నల్గొండ జిల్లా మాల్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలియజేశారు. గురువారం మృతురాలి తండ్రి హరిరాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

కారు అద్దం పగులగొట్టి రూ.లక్ష చోరీ



పెబ్బేరు రూరల్: కారు అద్దం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు నగదుచోరీ చేసిన ఘటన గురువారం వనపర్తి పట్టణంలో ఓ ఎలక్ట్రానిక్ షాపు ఎదుట చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ జయన్న కథనం ప్రకారం.. ముసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లికి చెందిన మల్యాల వినయ్‌కుమార్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తమ బంధువులకు ఇచ్చేందుకు నగదు బ్యాంకు నుంచి డ్రా చేసేందుకు వనపర్తికి వచ్చారు. పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి రూ.లక్ష డ్రా చేసుకున్నారు. సదరు నగదును తన సొంత కారులో పెట్టి పూజ ఎలక్ట్రానిక్ షాపు ముందు నిలిపారు. మరో రూ. 30 వేలు డ్రా చేసేందుకు ఏటీఎంకు వెళ్లారు. డబ్బులు డ్రా చేసుకొని తిరిగి వచ్చేసరికి చూసేసరికి కారు ఎడమ పక్క అద్దం పగిలి ఉండడం గమనించారు. అందులో ఉన్న రూ.లక్ష నగదును ఎవరో చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసున మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

ఎస్వీడీసీలో ప్రాంగణ ఎంపికలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్వీడీసీ కళాశాలలో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ మేరకు టెక్ మహేంద్ర, జెన్‌ప్యాక్, క్యాలిబర్, యాక్సిస్ బ్యాంక్ ఇతర సంస్థల ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించగా, 250 మంది అభ్యర్థులు హాజరైతే 79 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతున్న క్రమంలోనే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బ్యాడ్మింటన్ పోటీలు



ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

- ఉత్కంఠగా సాగిన మెయిన్ డ్రా మ్యాచ్‌లు
- పాలమూరు క్రీడలకు కేరాఫ్‌గా మారింది: ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి శనివారం వరకు జరగనున్న పదో రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అట్టహాసంగా ప్రారంభమైంది. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో మెయిన్ డ్రా మ్యాచ్‌లు ఉత్కంఠంగా జరిగాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు మహబూబ్‌నగర్ వేదిక

ఈ పోటీలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే, పలువురు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహబూబ్‌నగర్ పట్టణం రాష్ట్రస్థాయి పోటీలకు వేదికకావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా క్రీడలకు కేరాఫ్‌గా నిలిచి,



టోర్నీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జిల్లా నుంచి ప్రతిభగల క్రీడాకారులను వెలికితీసి జాతికి పరిచయం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఏ క్రీడలు అయినా రాణించాలంటే ఆసక్తి మాత్రమే కాదు, క్రమశిక్షణ కూడా ఎంతో ముఖ్యమన్నారు. మనకు మంచి ఇండోర్ స్టేడియం అందుబాటులో ఉందని, భవిష్యత్‌లో అంతర్రాష్ట్ర టోర్నమెంట్‌లతోపాటు జాతీయస్థాయిలో పోటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, టోర్నమెంట్ పరిశీలకుడు రంగారావు, శ్రీనివాసరావు, శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్, విజయ్‌రెడ్డి, శివప్రసాద్, సాదత్‌ఖాన్, రాజశేఖర్, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

మొదటి రోజు ఫలితాలు

సింగిల్స్ బాలికల్లో హాసినివర్మ 21–2, 21–6 సెట్ల తేడాతో తేజస్వినిపై, కీర్తి 22–20, 21–15 తేడాతో లక్ష్మి రిధిమ దేవనిపై, వాసిరెడ్డి వేదస్వి 21–6, 21–4 తేడాతో ఈ.శ్వేతపై, పి.నిసర్గ 21–11, 21–9 తేడాతో జ్యోషికాపై, రిష్తా పాండే 21–17, 21–13 తేడాతో అనుసంజన మురళీపై, అనుమల శ్రీవల్లి 21–17, 21–18 తేడాతో సమీక్షరెడ్డిపై, ప్రసన్న బోనం 21–10, 21–16 తేడాతో కొత్త నైనికరెడ్డిపై, సింగిల్స్ బాలురలో ఎస్.అఖిల్ రావు 21–14, 21–17 తేడాతో యువ సూర్య జాగర్లముడిపై, జయేంష్‌రెడ్డి 21–14, 21–14 తేడాతో బొమ్మకంటి శ్రీఆదిత్యపై గెలుపొందారు.

■ డబుల్స్ బాలికల్లో శ్రీవైష్ణవి–వైఎస్ సుప్రియ, హాసిని వర్మ–శ్రావ్య ఆకుల, సాయి శృతి–సమీక్ష యాదవ్, జంధ్యాల ఐశ్వర్య–రియా నీలుకుర్తి, అక్షయ చౌదరి–అనుమల శ్రీవల్లి, కొత్త నైనికరెడ్డి–శ్రీఖా, డబుల్స్ బాలురలో నవనీత్–వెంకట్ మానిష్, అశ్రిత్ వలిశెట్టి–జయంశ్‌రెడ్డి, అభిషేక్–వర్షిత్ శ్రీసాయి, అఖిల్‌రావు–నిషాంత్, మిక్స్‌డ్ డబుల్స్‌లో సాయిరిశ్వంత్–వేదశ్వి వాసిరెడ్డి, వర్షిత్ శ్రీసాయి–అలీషాఖాన్, ప్రణయ్‌శ్రీకర్–శ్రీవైష్ణవి, జలగం ప్రణీత్–శిఖ, అజయ్‌కార్తీక్–కీర్తి విజయాలు నమోదు చేసుకున్నారు.

ప్రైవేట్ క్లినిక్‌లలో అధికారుల తనిఖీ

- బల్గెరలో క్లినిక్ సీజ్

గట్టు: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రాలను గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శశికళ, ఉప అధికారి సిద్దప్ప, మాతశిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి స్రవంతి, మధుసూదన్‌రెడ్డి బల్గెరలో పర్యటించారు. కేశవనాయుడు ఎలాంటి అనుమతులు లేకుండా సాక్షి పాలి క్లినిక్‌ను నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించారు. ఈ క్లినిక్‌లో ఆక్సిజన్ సిలిండర్లు, బేబీ వార్మ్ ఎస్‌పీఓ–2 (ఆక్సిజన్ శాతాన్ని కొలిచే మిషన్)తో పాటుగా 5 బెడ్లను ఐవీ స్టాండ్స్, అధిక మొత్తంతో మెడిసిన్స్(మినీ ఫార్మసీ)రెఫరల్ స్లిప్స్ గుర్తించారు. క్లినిక్ నిర్వహిస్తున్న వ్యక్తి అల్లోపతి ప్రాక్టిస్ నిర్వహించేందుకు ఎలాంటి అర్హత లేదని, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్లినిక్‌ను సీజ్ చేశారు. ఇదే గ్రామంలో నర్సింహులు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రాన్ని వైద్యాధికారులు తనిఖీ చేపట్టారు. అధిక మొత్తంలో యాంటిబయోటిక్, పెయిన్ కిల్లర్స్ ఇంజక్షన్లు, సర్జికల్ పరికరాలను గుర్తించారు. అధిక మోతాదులో మెడిసిన్ ఉండడంతో వాటిని సీజ్ చేశారు. ప్రథమ చికిత్స మాత్రమే చేయకుండా, ఇతర అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందించినట్లయితే క్రిమినల్ కేసులను నమోదు చేయనున్నట్లు అధికారులు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఓ క్లినిక్‌ను అధికారులు తనిఖీ చేశారు. వాడి పారేసిన సూదులు, బాటిళ్లను పడేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బల్గెరలో సీజ్ చేసిన క్లినిక్ వద్ద వైద్యాధికారులు

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం ఎదుట నిందితుడితో పోలీసులు

అమరచింత: అక్రమంగా రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండలంలోని తూక్యానాయక్ తండా నుంచి బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని రాయిచూర్‌కు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అమరచింత శివారులో వాహనాన్ని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తెలియజేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నందకిషోర్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి తూక్యానాయక్ తండాకు చెందిన సురేష్ నాయక్ అక్రమంగా 20 క్వింటాళ్ల 80 కిలోల రేషన్ బియ్యాన్ని రాయచూర్‌కు తరలిస్తున్నట్లు వెల్లడైందన్నారు. కేసు నమోదు చేసి రేషన్ బియ్యాన్ని స్టాక్ పాయింట్‌కు పంపామన్నారు.

బాహటంగా రేషన్ డీలర్ల దందా...

మండలంతో పాటు పట్టణంలో రేషన్ డీలర్లే బియ్యం వ్యాపారులుగా అవతారమెత్తి వినియోగదారుల నుంచి బియ్యాన్ని బాహటంగా కొనుగోలు చేస్తున్న పరిస్థితులు దాపురించాయి. రేషన్ దుకాణాలకు వస్తున్న వినియోగదారులకు కిలో బియ్యంకు రూ.10 నుంచి రూ.12 ప్రకారం చెల్లించి వారి బియ్యాన్ని రేషన్ దుకాణాల్లో ఉంచుకుంటున్నారు. ఆ బియ్యాన్ని అక్రమంగా వ్యాపారులకు అమ్ముతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బాలికను వివాహమాడిన వ్యక్తి

- సహకరించిన వారందరిపై కేసు నమోదు

మహమ్మదాబాద్: వివాహ వయస్సు రాకుండానే ఓ బాలికను వివాహ చేసుకున్న వ్యక్తిపై, కుటుంబసభ్యులు, సహకరించిన వారిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండేడ్ మండలంలోని వెన్నాచేడ్ చెందిన ఓ వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాలికను గత నెల వివాహం చేసుకున్నాడు. ఈ విషయం కాస్త బాలల హక్కుల వేదిక సభ్యులకు తెలిసింది. వారు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, గురువారం వివాహం చేసుకున్న వ్యక్తిపై, కుటుంబ సభ్యులు, వివాహానికి సహకరించిన వారిపై చైల్డ్ మ్యారేజ్ యాక్టు, పోక్సోచట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సులో మహిళ వీరంగం: కేసు నమోదు



పాన్‌గల్: ఆర్టీసీ బస్సులో ఓ మహిళ వీరంగం చేసిన ఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కల్యాణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆది సునీత ఆర్టీసీ బస్సు దిగే క్రమంలో తోటి ప్రయాణికులతో గొడవ పెట్టుకుంది. వారిని దూషించి చేతులతో కొట్టి, అడ్డు వచ్చిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌లను దూషించి బస్సు అద్దాన్ని ధ్వంసం చేసింది. కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుట్టుగా ఫిల్టర్ ఇసుక తయారీ

- కూలీ మృతితో వెలుగులోకి వ్యవహారం



దుబ్బన్న (ఫైల్)

గద్వాల క్రైం: ఫిల్టర్ ఇసుక తరలించే క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కిందపడి కూలీ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గద్వాల మండలం సంగాల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, తోటి కూలీల తెలిపిన వివరాల ప్రకారం.. సంగాలకు చెందిన దుబ్బన్న(40) మరో ముగ్గురు కలసి సంగాల రిజర్వాయర్ సమీపంలో అదే గ్రామానికి చెందిన చిన్నకుర్వ వీరన్న ట్రాక్టర్‌కు గురువారం తెల్లవారుజమున ఫిల్టర్ ఇసుకను తీసుకొచ్చేందుకు కూలీలుగా వెళ్లారు. అయితే ఇసుకను 99 ప్యాకేజ్ కాల్వ మీదుగా ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని సంగాల వైపునకు తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో గుంతల రోడ్డు మీదుగా వస్తున్న క్రమంలో డ్రైవర్ పక్కనే కూర్చున్న దుబ్బన్న ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ దుబ్బన్న తలపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భయపడిన కూలీలు ట్రాలీలో ఉన్న ఇసుకను డంపుల వద్దనే అన్‌లోడ్ చేసి మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించి జరిగిన ప్రమాదాన్ని తెలియజేశారు. అయితే కూలీ పనులకు వెళ్లిన దుబ్బన్న మృతి చెందడంపై కుటుంబ సభ్యులు, బంధువులు కలత చెందారు. జరిగిన ప్రాణనష్టానికి బాధ్యులెవరని నిలదీశారు. గ్రామస్తులు కల్పించుకుని నష్టపరిహారం అందేలా చూస్తమని భరోసా ఇచ్చారు. అక్రమంగా ఫిల్టర్ ఇసుక తయారీ దందా సాగిస్తున్న విషయాన్ని గ్రామస్తులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.

వెలుగులోకి ఇలా..

దుబ్బన్న మృతి చెందిన క్రమంలో ట్రాక్టర్ యాజమాని ప్రమాద ఘటన వద్ద మృతదేహాన్ని హుటాహుటిన తీయడం, ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఫిల్టర్ ఇసుకను డంపుల వద్ద పారబోయడం, ట్రాక్టర్‌ను మాయం చేశారు. వాస్తవంగా ఏదైని ప్రమాదం జరిగితే పోలీసుల పంచానామ, సాక్షుల వాంగ్మూలం తర్వాత పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించాలి. ఇక్కడ మాత్రం వ్యాపారులు ప్రమాదం జరిగిన చోటు నుంచి మృతదేహాన్ని తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించిన తీరుపై సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. ఇసుక తరలించేందుకు వెళ్లలేదని, ఇంటి నిర్మాణం కోసం అవసరమయ్యే రాళ్ల తరలించే పనులకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులచే చెప్పించే ప్రయత్నం చేశారు. ఘటనపై పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు, మీడియా అక్కడికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాద స్థలం, ఫిల్టర్ ఇసుక నిల్వలను పోలీసులు పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం కోసం కుటుంబ సభ్యుల సాయంతో మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు..

ఈ ఘటనపై రూరల్ ఎస్‌ఐ పర్వతాలును వివరణ కోరగా.. గ్రామ శివారు నుంచి రాళ్ల తరలింపు కోసం కూలీ పనులకు ట్రాక్టర్ యాజమాని కుర్వచిన్న వీరన్న వారి డ్రైవర్, మరో ముగురు కలిసి ట్రాక్టర్‌పై వెళ్లారు. ఈ క్రమంలో 99 ప్యాకేజ్ కాల్వ మీదుగా డ్రైవర్ వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతున్నాడు. ఈ క్రమంలో మృతుడు కిందపడిపోవడంతో ట్రాక్టర్ ట్రాలీ టైర్లు తలపై వెళ్లడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని తల్లి పెంటమ్మ ఫిర్యాదు చేసిందన్నారు. వస్తున్న ఆరోపణలపై విచారణ చేపడుతామన్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు.



సంగాల శివారులో భారీ ఫిల్టర్ ఇసుక డంపులను పరిశీలిస్తున్న పోలీసులు



ప్రమాద స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మద్దూరులో దొంగల హల్‌చల్

- అర్ధరాత్రి దాటాక తలుపు కొట్టి భయపెడుతున్న వైనం
- విచారణ చేపట్టిన పోలీసులు

మద్దూరు: నారాయణపేట జిల్లా మద్దూరులో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో వారం రోజులుగా పట్టణంలో ప్రజలకు కంటిపై కునుకు కరువైంది. దొంగలు అర్ధరాత్రి దాటాక తలుపు కొట్టి ప్రజలను భయభాంత్రులకు గురిచేస్తున్నారు. కాగా ఇప్పటివరకైతే ఎలాంటి చోరీ ఘటన నమోదు కాలేదు. అయితే నాలుగు రోజుల క్రితం పాతబస్టాండ్ సమీపంలో ఎర్రచున్ని ముఖానికి చుట్టుకొని అర్ధరాత్రి దాటాక గల్లీలో ఓ వ్యక్తి అనుమానస్పదంగా తిరిగిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ మేరకు ఆ వీధి వాళ్లు పట్టుకునే ప్రయత్నం చేయగా అతడు పారిపోయాడు. మూడురోజుల క్రితం మెట్ల గేరిలోని తమ కంపౌండ్‌లోకి ఓ వ్యక్తి దూకి తలుపు కొట్టినట్లు మైనోద్దీన్ కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం తెల్లవారుజామునా చింతల్‌దిన్నె రోడ్డులోని సిదిరేట్ తోటలోని ముష్టి నర్సిములు ఇంట్లో మగవారు ఎవరు లేని సమయంలో కొందరు తలుపులు కొట్టి భయభాంత్రులకు గురిచేసినట్లు బాధితులు తెలిపారు. అలాగే రెనివట్ల రోడ్డులోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల సెల్లార్‌లో ఓ వ్యక్తి ముఖానికి చున్ని చుట్టుకొని నగ్నంగా నడుచుకుంటూ వెళ్లి లైట్లను ఆర్పివేసిన ఘటన చోటు చేసుకుంది. రోజూ రాత్రి ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటుండడంతో యువకులు ఇళ్లపై ఉండి దొంగల కోసం నిఘాపెట్టారు. ఏ చిన్న అలికిడి జరిగిన అందరూ గుమిగూడడంతో వారు పారిపోతున్నారని పోలీసులు తెలిపారు. గతంలోనూ పోలీసులు దొంగలను పట్టుకోవడానికి రాత్రిల్లో నిఘా పెట్టి తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దీంతో ప్రతిరోజు దొంగల కోసం జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



బీసీ బాలికల వసతి గృహంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాంలాల్

ఘటనా స్థలాలను పరిశీలించిన ఎస్‌ఐ

పట్టణంలో చోటు చేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో ఎస్‌ఐ రాంలాల్ గురువారం ఆయాచోట్లను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. అదేవిధంగా బీసీ బాలికల వసతిగృహం పరిశీలించి ఏ చిన్న అలికిడి జరిగిన తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రెనివట్ల రోడ్డులోని ఎస్సీ గురుకుల పాఠశాలలో నమోదైన ఘటనపై సీసీ పుటేజీని పరిశీలించారు. దొంగల కోసం వీధుల వెంబడి యువకులు తిరగడం వల్ల చోరీదారులను గుర్తించలేకపోతున్నామని అన్నారు. అందువల్ల ఎవరి ఇళ్ల దగ్గర వారు ఉండాలని సూచించారు.

టిప్పర్ కింద పడి వ్యక్తి దుర్మరణం



నర్సింహారెడ్డి(ఫైల్)

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో టిప్పర్ కింద పడి ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాగనూర్ మండలం పర్మాన్‌దొడ్డికి చెందిన నర్సింహారెడ్డి(34) మక్తల్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నాడు. ఆయన భార్య భీమమ్మకు నారాయణపేట మున్సిపాలిటీలో ఉద్యోగం రావడంతో కుటుంబాన్ని జిల్లా కేంద్రానికి మార్చి, స్థానిక కుర్వగేరిలో అద్దెకు ఉంటున్నాడు. భార్యకు కంటిచూపు లేకపోవడంతో ఆమెకు సహాయ పడుతూ పట్టణంలోని ఓ బంగారు దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇటీవల వ్యక్తిగత కారణాలతో పని మానేసి ఇంట్లోనే ఖాళీగా ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం టీ తాగడానికి తన స్కూటీపై ఇంటి పక్కన ఉన్న వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో హాజిఖాన్‌పేట గల్లి నుంచి ప్రధాన రహదారిపైకి స్కూటీపై వస్తున్నారు. స్కూటీ వెనుక కూర్చున్న వెంకటేశ్వర్‌రెడ్డి టిప్పర్ రావడాన్ని గమనించి భయంతో వెళ్తున్న స్కూటీ పైనుంచి కిందకు దూకాడు. దీంతో ఆయన చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీ అదుపుతప్పి కింద పడిపోవడంతో నర్సింహారెడ్డి రోడ్డుపై పడిపోయాడు. వెంటనే అటుగా వచ్చిన టిప్పర్ ఆయన పైనుంచి వెళ్లిపోయింది. దీంతో శరీరం రెండు ముక్కలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. సంఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.



ప్రమాదానికి కారణమైన టిప్పర్

1,420 లీటర్ల డీజిల్ అక్రమ నిల్వ

- సీజ్‌చేసిన అధికారులు
- ఇద్దరిపై కేసునమోదు

ఊట్కూరు: నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఇద్దరి ఇళ్లలో అక్రమంగా నిల్వచేసిన డీజిల్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారి కాలప్ప కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన విశ్వనాథ్, వెంకట్‌రెడ్డి తమ ఇళ్లలో 9 ప్లాస్టిక్ డ్రమ్ములలో సుమారు 1420 లీటర్ల డీజిల్‌ను అక్రమంగా నిల్వచేశారు. ఈ విషయంపై కొంతమంది అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు దాడులు చేసి డీజిల్‌ను సీజ్ చేశారు. ఈమేరకు ఊట్కూరులోని ఇండియన్ పెట్రోల్ పంపు వద్ద నిల్వ ఉంచారు. విశ్వనాథ్, వెంకట్‌రెడ్డిలపై కేసునమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ వివరించారు.



పట్టుబడిన డీజిల్‌తో అధికారులు

రుణ బకాయిలు చెల్లించని వ్యక్తిపై కేసు

మానవపాడు: స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణం తీసుకుని వాయిదాలు చెల్లించని వ్యక్తిపై గురువారం కేసు నమోదైంది. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఆముదాలపాడు చెందిన పూజారి రాఘవేంద్రస్వామి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఈయన నారాయణపురం శివారులో కోల్డ్ స్టోరేజీ నిర్మించుకోవడానికి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మహబూబ్‌నగర్‌లో రూ.7.50కోట్లు రుణం తీసుకున్నారు. ఇందుకు 10 ఎకరాల భూమిని తనాఖా పెట్టారు. రుణ బకాయిలు చెల్లించకపోగా, తనాఖా పెట్టిన భూమిని ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడు. దీనిపై మహబుబ్‌నగర్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ బ్యాంక్ మేనేజర్ శశికుమార్ మార్చి 13వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఇంటి వద్ద ఉదయం అదుపులోకి తీసుకుని అలంపూర్ కోర్టులో హాజరుపరిచారు. సివిల్ కోర్టు జడ్జి కవితాదేవి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరేళ్లకు చోరీ సొత్తు స్వాధీనం

- నిందితుడు అరెస్ట్, రిమాండ్ తరలింపు

రాజాపూర్: ఓ ఇంట్లో చోరీకి గురైన ఆభరణాలు ఆరేళ్లకు పోలీసులు రికవరీ చేశారు. వివరాల్లోకి వెళితే.. గురువారం ఎస్‌ఐ తిరుపాజి, సిబ్బంది బాలానగర్ మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఓ యువకుడు పోలీసులను చూసి పరారయ్యాడు. అతన్ని పట్టుకుని విచారించగా ఉడిత్యాల గ్రామ పరిధిలోని మామిడిగుట్టతండాకు చెందిన శరత్‌గా తేలింది. ఈయన బాలానగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ చేసినట్లు చెప్పాడు. రవీందర్ 2018లో ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో శుభకార్యానికి వెళ్లారు. గమనించిన శరత్ ఇంటి తాళాలు పగులగొట్టి 30 తులాల వెండి పట్టగొలుసులు, 10 తులాల వెండి కడియాలు, తులం బంగారు కమ్మలు, రూ.6వేల నగదును దొంగిలించినట్లు తెలిపారు. దీంతో దొంగిలించబడ్డ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామన్నారు. ఈయనపై విజయవాడలో కూడా ఓ కేసు నమోదైనట్లు ఎస్‌ఐ తెలిపారు.



బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న వెండి, బంగారు ఆభరణాలు

చంద్రబాబూ.. పద్ధతి మార్చుకో

▶ మొదటి పేజీ తరువాయి
దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని నిప్పులు చెరిగారు. ఇది ఏ మాత్రం న్యాయం కాదని, ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాలు పండుతున్నాయని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై, మంచి పాలన అందించడంపై చంద్రబాబు దృష్టి పెడితే మంచిదన్నారు. నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గురువారం వైఎస్ జగన్ ములాఖత్ ద్వారా పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా విధ్వంసక చర్యలు జరుగుతున్నాయి. కేవలం టీడీపీకి ఓటు వేయలేదన్న కారణంతో ఏకంగా ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. దొంగ కేసులు పెడుతున్నారు. వీళ్లే కొడతారు, మళ్లీ వీళ్లే అటు వైపున ఉన్న వారి మీద కేసులు పెడతారు. ఇంతటి దారుణంగా ఈ రోజు రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పరిపాలనలో కులం చూడలేదు, మతం చూడలేదు. ప్రాంతం చూడలేదు. చివరికి ఏ పార్టీకి ఓటు వేశారన్నది కూడా చూడకుండా ప్రతి పథకం, ప్రతి మంచిని అర్హత ప్రామాణికంగా ప్రతి ఇంటికీ డోర్ డెలివరీ చేశాం. ఈ రోజు చంద్రబాబునాయుడుకు ఓటు వేయలేదనే కారణంతో అన్యాయంగా రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను విరగ్గొడుతున్నారు.. పగలగొడుతున్నారు. ఇవన్నీ శిశుపాలుని పాపాల మాదిరిగా పండుతాయి. ప్రజాస్వామ్యంలో ఏదైనా ప్రజలకు మంచి చేసి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుని, ప్రజల దగ్గరకు వెళ్లి ఫలాన మంచి చేశాం కాబట్టి ఓటు వేయండి అనే పరిస్థితులు ఉండాలి. కానీ ఈ మాదిరిగా దౌర్జన్యాలు చేసి, అన్యాయమైన కేసులు పెట్టి, ఆస్తులు ధ్వంసం చేసి, భయాందోళనలు సృష్టిస్తూ రాజకీయాలు చేస్తే, అలాంటి రాజకీయం ఏ రోజూ నిలబడదు. తాత్కాలిక మేలు ఏదైనా జరుగుతుందేమో కానీ తర్వాత ఓటు వేసేటప్పుడు ప్రజలు ఇవన్నీ కచ్చితంగా గుర్తు పెట్టుకుంటారు. అందుకే చంద్రబాబులో మార్పు రావాలి. లేదంటే ప్రజలు లెక్కా జమా సరిచేసి చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి' అని వైఎస్ జగన్ నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రజలు మీకు ఓటు వేసింది ఎందుకు?

- ప్రజలకు మంచి చేసి వైఎస్సార్‌సీపీ ఓడిపోలేదు. చంద్రబాబు నాయుడు చేసిన మోసపూరిత హామీలకు ప్రజలు కాస్తో కూస్తో కొద్దిగా ఆకర్షితులయ్యారు. 10 శాతం ఓట్లు అటు షిఫ్ట్ అయ్యి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారు. మేనిఫెస్టోలో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారు. రైతులకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తానన్నారు. ఖరీఫ్‌లో జోరుగా వ్యవసాయం పనులు జరుగుతున్నాయి. రైతన్నలు పంటలు వేగంగా వేస్తున్నారు. ఇంతవరకు రైతు భరోసా రూ.20 వేలు ఇస్తానన్న దానికి అతీగతీ లేదు.
- బడులు మొదలయ్యాయి. అమ్మ ఒడి కింద జగన్ రూ.15 వేలు ఐదేళ్ల పాటు ఇచ్చాడు. చంద్రబాబు నాయుడు ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ ఇస్తాడని, ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు ఇస్తాడని చెప్పారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా బడి ఈడు పిల్లలున్నారు. తల్లికి వందనం కింద ఆ డబ్బులేమయ్యాయి అని ప్రతి తల్లీ అడుగుతోంది.
- 18 ఏళ్లు పైబడిన ప్రతి అక్క చెల్లెమ్మకు రూ.1,500 చొప్పున సంవత్సరానికి రూ.18 వేలు ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో 4.12 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని మొన్ననే లెక్కలు తేలాయి. అందులో దాదాపుగా 2.10 కోట్ల మంది మహిళా ఓటర్లే. అందరూ 18 సంవత్సరాలు నిండిన వారే. ప్రతి నెలా రూ.1500 ఇస్తానన్నావు, ఏమైంది? అని వీరందరూ ఈ రోజు అడుగుతున్నారు.
- వీటన్నింటి మీద ధ్యాస పెట్టే కార్యక్రమం చంద్రబాబు నాయుడు చేయాలి. గవర్నెస్ మీద కాస్త ధ్యాస పెట్టి ఆ తల్లులకు డబ్బులిచ్చే కార్యక్రమం చూడండి. రైతులకు రూ.20 వేలు ఇచ్చే కార్యక్రమం చూడండి. ప్రజలు ఎందుకు తమకు ఓటు వేశారు అని చంద్రబాబు నాయుడు ఆలోచించాలి. ఇవేవీ కూడా చేయకుండా కేవలం భయాందోళనలు నెలకొల్పాలి.. రాష్ట్రంలో రావణకాష్టం రగిలించాలి.. దొంగ కేసులు పెట్టి ఇరికించాలి.. ఆస్తులను ధ్వంసం చేయాలి.. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన వారెవరినీ ఉంచకూడదు అన్న దుర్మార్గపు ఆలోచనలతో అడుగులు ముందుకు వేయడం అతి హేయమైన రాజకీయం.


నెల్లూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

పిన్నెల్లిపై ఇంత అన్యాయంగా కక్ష సాధింపా?

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మీద ఏకంగా 307 అంటే హత్యాయత్నం కేసు పెట్టారు. ఏ రకంగా అన్యాయంగా అతన్ని జైల్లో నిర్బంధించారో చూస్తున్నాం. కారంపూడి ఘటన జరిగిందెప్పుడు? ఎన్నికలు అయిపోయిన మరుసటి రోజు అంటే మే 14న. కారంపూడిలో టీడీపీ ఆకృత్యాలకు ఒక ఎస్సీ కుటుంబంలోని మహిళలు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చినందున వాళ్లను పరామర్శించడానికి డీఎస్పీ అనుమతి తీసుకుని అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి బయల్దేరాడు.
- కారంపూడికి అటు వైపున ఎస్సీ కుటుంబం ఇల్లు ఉంటే.. ఎమ్మెల్యే ఊర్లోకి ప్రవేశించక ముందే ఇటు వైపు అడ్డగించారు. గొడవ టౌన్‌లో జరుగుతుంటే పిన్నెల్లిని ఊరుబయటే అడ్డగించారు. నారాయణస్వామి అనే సీఐని పిన్నెల్లి చూసిన దాఖలాలు కూడా లేవు. మే 14న గొడవ జరిగితే 9 రోజుల తర్వాత అంటే మే 23న ఆయనకేదో జరిగింది అన్నట్లుగా ఆ సీఐ, రామకృష్ణారెడ్డి మీద హత్యాయత్నం కేసు పెట్టాడు. ఆ సీన్లో లేని వ్యక్తిపై ఈ కేసు బనాయించారు. ఇది అన్యాయం కాదా?
- అసలు ఇన్సిడెంట్ నిజంగా జరిగిందో లేదో కూడా తెలియదు. మే 14న జరిగి ఉంటే మే 15న మెడికో లీగల్ కేసు ఎందుకు పెట్టలేదు? 17వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం సిట్ వేసింది. 17 నుంచి 20వ తేదీ వరకు పల్నాడు ప్రాంతంలో ఆ సిట్ బృందం తిరిగి ఘటనపై రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టులో ఎందుకు ఈ అంశం రాలేదు? అలాంటప్పుడు ఈ రకంగా హత్యాయత్నం కేసులో ఒక మనిషిని ఇరికించడం ధర్మమేనా?

ప్రతి దశలో ఓ రెడ్‌బుక్

- ప్రతి ఒక్కరూ వాళ్ల వాళ్ల స్థాయిలో రెడ్‌బుక్స్ అని చెప్పి పెట్టుకున్నారు. చంద్రబాబు స్థాయిలో ఒక రెడ్‌బుక్, లోకేశ్ స్థాయిలో ఒక రెడ్‌బుక్, ఎమ్మెల్యే స్థాయిలో, మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో ఇలా రెడ్‌బుక్‌లు పెట్టుకుని ఏం చేస్తున్నారు? అతి దారుణంగా, అన్యాయంగా ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు.
- మీ విధ్వంసాలు, దాడులను రాష్ట్రం మొత్తం చూస్తోంది. కానీ ఎవరూ మాట్లాడటం లేదు. దొంగ కేసులు పెడుతున్నారు. చీనీ చెట్లు నరికేస్తున్నారు. జేసీబీలు, పొక్లెయిన్ల మీద స్వయంగా ఎమ్మెల్యేలు తిష్ట వేసి బిల్డింగులు పగలగొట్టే కార్యక్రమాలు చేస్తున్నారు. ఊరూరా ఆస్తుల ధ్వంసం, దాడులు, దౌర్జన్యాలపై పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

ఎమ్మెల్యే 10 సార్లు ఫోన్ చేసినా ఎస్పీ స్పందించలేదు

- మే 13న ఎన్నికల సమయంలో పాల్వాయి గేట్ అనే పోలింగ్ కేంద్రం దగ్గరకు అప్పటి ఎమ్మెల్యే వెళ్లినప్పుడు జరిగిన ఘటన మీద మరో కేసు పెట్టారు. అసలు ఆ ఘటన ఎందుకు జరిగింది? అక్కడ ఉన్న ఎస్సీ సామాజిక వర్గం వారు పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేసే పరిస్థితి లేనప్పుడు ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లారు. ఆ పరిస్థితులను చూసి ఎస్పీకి 10 సార్లు ఫోన్ చేసినా కూడా స్పందించని పక్షంలో కనీసం సీఐని, ఎస్సైని పంపించండనే పరిస్థితుల్లో ఉన్నారు. అలాంటి సెన్సిటివ్ బూత్‌లో కేవలం ఒకే ఒక్క హోంగార్డును పెట్టారు. అటువంటి పరిస్థితుల్లో ఆ ఘటన జరిగింది. ఆ ఈవీఎం పగలగొట్టిన కేసులో తనకు బెయిల్ వచ్చింది. కానీ ఎవరిపైనో హత్యాయత్నం చేశాడని తప్పుడు కేసులు పెట్టి ఇవాళ జైలు పాలు చేశారు.
- ఈ ఘటన జరిగిన 10 రోజుల తర్వాత అంటే మే 23వ తారీఖున కేసులు పెట్టారు. రిగ్గింగ్‌ను అడ్డుకునే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేస్తే, హత్యాయత్నం చేశాడని తప్పుడు కేసులు పెట్టారు. నిజంగా అటువంటిది జరిగి ఉంటే సిట్ 17వ తారీఖు నుంచి 20వ తారీఖు మధ్యలో ఇచ్చిన రిపోర్టులో చెప్పాలి కదా? 2009 నుంచి వరుసగా నాలుగు సార్లు పిన్నెల్లి గెలిచాడంటే మంచోడు కాబట్టే ప్రజలు ఆశీర్వదిస్తూ వచ్చారు. అటువంటి వ్యక్తిని తీసుకొచ్చి తప్పుడు కేసుల్లో ఇరికించడం ఎంత వరకు ధర్మం? ఈ రోజు ఇది రామకృష్ణారెడ్డి ఒక్కడి పరిస్థితే కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇలానే జరుగుతోంది.
- వైఎస్ జగన్ వెంట మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు పిన్నెల్లితో ములాఖత్‌లో పాల్గొన్నారు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు తలశీల రఘురామ్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కల్యాణ చక్రవర్తి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.

'విభజన' కొలిక్కి వచ్చేనా?

రేపు హైదరాబాద్‌లో తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ • అపరిష్కృత విభజన వివాదాలపై చర్చించనున్న నేతలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న విభజన వివాదాలు మళ్లీ తెరపైకి రానున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో అపరిష్కృత అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య మళ్లీ చర్చలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎ.రేవంత్‌రెడ్డి, ఎన్.చంద్రబాబునాయుడు శనివారం హైదరాబాద్ లోని ప్రజాభవన్‌లో సమావేశమై వీటిపై చర్చించనున్నారు. గతంలోనూ పలుసార్లు చర్చలు జరిగినా ప్రతిష్టంభన తొలగలేదు. కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా నేతృత్వంలో జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశాల్లో సైతం వివాదాలకు పరిష్కారం లభించలేదు. ఈ నేపథ్యంలో శనివారం జరిగే భేటీపై ఆసక్తి నెలకొంది. రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న ముఖ్యమైన అంశాలను ఓసారి పరిశీలిస్తే..

షెడ్యూల్–9లోని ప్రభుత్వరంగ సంస్థల విభజనపై

విభజన చట్టంలోని షెడ్యూల్–9లో పొందుపరిచిన 91 ప్రభుత్వ రంగ సంస్థల్లో 53 సంస్థల విభజనపై రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి విభేదాలు లేవు. 15 సంస్థల విభజనకు తెలంగాణ అంగీకరించగా, ఏపీకి మాత్రం అభ్యంతరాలున్నాయి. మిగిలిన 23 సంస్థల విభజన విషయంలో తెలంగాణకు అభ్యంతరాలున్నాయి. ఇందుకు సంబంధించి షీలా భిడే కమిటీ సిఫారసులను పూర్తిగా అంగీకరించాలని ఏపీ కోరుతుండగా, కొన్నింటిపై తెలంగాణకు అభ్యంతరాలున్నాయి. దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్(దిల్)కు హైదరాబాద్‌లో కేటాయించిన భూములను తెలంగాణ స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించగా, ఏపీ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంది. దిల్ ఆస్తులను సైతం విభజించాలని నిపుణుల కమిటీ సిఫారసు చేయడాన్ని తెలంగాణ వ్యతిరేకిస్తోంది. పలు సంస్థలకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండడంతో గతంలో నిర్వహించిన చర్చల్లో ముందడుగు పడలేదు.

ముదిరిన ఫైనాన్స్ కమిషన్ విభజన

ఏపీ ఫైనాన్స్ కమిషన్ విభజన ప్లాన్.. కమిషన్ బోర్డు 2016లో ఏకపక్షంగా రూపొందించి కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపడంతో వివాదం ముదిరింది. రంగారెడ్డి జిల్లాలో ఉన్న 238 ఎకరాల భూములను కమిషన్ నుంచి స్వాధీనం చేసుకోవడానికి తెలంగాణ ప్రయత్నించగా, ఏపీ ప్రభుత్వం 2015లో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంది. నాటి నుంచి న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉంది. రూ.వేల కోట్ల విలువ చేసే భూములు కావడంతో రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరడం లేదు.

ప్రాతిపదిక జనాభానా? ప్రాంతమా?

షెడ్యూల్–10లోని 142 ప్రభుత్వ రంగ సంస్థల విభజనపై ప్రతిష్టంభన నెలకొంది. ఏపీ ఉన్నత విద్యామండలి కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల ఆధారంగా ఈ సంస్థల విభజనకు కేంద్రం గతంలో మార్గదర్శకాలు జారీ చేయగా తెలంగాణ అంగీకరించింది. జనాభా దామాషా ప్రకారం నగదు నిల్వలను, లొకేషన్ (ప్రాంతం) ఆధారంగా స్థిరాస్తుల పంపకాలు జరపాలని కేంద్రం మార్గదర్శకాల్లో కోరింది. దీనిపై ఏపీ హైకోర్టును ఆశ్రయించగా, కేసు పెండింగ్‌లో ఉంది. ప్రాంతం ప్రాతిపదికన కాకుండా జనాభా దామాషా ఆధారంగా షెడ్యూల్–10 సంస్థల ఆస్తుల విభజన జరగాలని ఏపీ కోరుతుండగా, తెలంగాణ వ్యతిరేకిస్తోంది. సింగరేణి సంస్థ పూర్తిగా తెలంగాణదేనని, దాని అనుబంధ కంపెనీ అప్మెల్‌ను సైతం తమకే కేటాయించాలని తెలంగాణ కోరుతుండగా, ఏపీ మాత్రం సింగరేణి సంస్థతో పాటు అప్మెల్ విభజన జరపాలని కోరుతోంది. ఏపీ పౌరసరఫరాల సంస్థ విభజనకు ముందు తెలంగాణ వాడుకున్న రూ.354 కోట్లకు పైగా రుణాల చెల్లింపులను తెలంగాణ చేయాల్సి ఉండగా, కేంద్రం నుంచి తమకు రావాల్సిన సబ్సిడీ బకాయిలను ఏపీ బదిలీ చేయాలని తెలంగాణ కోరుతోంది. ఇక విభజన చట్టంలో పొందుపరచని 12 సంస్థల విభజనకు ఏపీ పట్టుపడుతుండగా, తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

వేల కోట్ల విద్యుత్ బిల్లులు

రెండు రాష్ట్రాల మధ్య విద్యుత్ బిల్లుల బకాయిల వివాదంపై ఎన్నో దఫాలుగా చర్చలు జరిగినా కొలిక్కి రాలేదు. తెలంగాణ నుంచి రూ.6,015 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు రావాల్సి ఉందని ఏపీ డిమాండ్ చేస్తుండగా, ఏపీ నుంచే తమకు రూ.17,828 కోట్లు రావాల్సి ఉందని తెలంగాణ పేర్కొంటోంది. ఏపీకి రూ.6,015 కోట్ల బకాయిలను చెల్లించాలని గతంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేయగా, తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకుంది.

తెగని జల పంచాయితీలు

తెలంగాణలో నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డిపై ఏపీ, ఏపీలో నిర్మిస్తున్న రాయలసీమ ఎత్తిపోతలపై తెలంగాణ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. కృష్ణా జలాల ఆధారంగా నిర్మిస్తున్న ప్రధానమైన ఈ రెండు ప్రాజెక్టులతో పాటు పలు ఇతర ప్రాజెక్టులపై సైతం రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. కృష్ణాజలాల శాశ్వత పంపకాలు, గోదావరిపై కొత్త ప్రాజెక్టుల నిర్మాణం వంటి అంశాలపై సైతం విభేదాలున్నాయి. రెండు రాష్ట్రాల సీఎంల మధ్య జరిగే చర్చల్లో కృష్ణా, గోదావరి జలాల పంపకాలు, ప్రాజెక్టులపై సైతం చర్చ జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

రేపు బీచుపల్లిలో సీతారాముల కళ్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు గురువారం ప్రకటనలో తెలిపారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం ప్రాజెక్టుకు కేవలం 19 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఆవిరి రూపంలో 132, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 7.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడుకు నీరు నిలిపివేత

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగ కొనసాగుతుంది. జూరాల సమాంతర, ఎడమ కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. గురువారం 1,019 అడుగులకు నీటిమట్టం చేరింది. తాగునీటి కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

బాలికపై చిన్నాన్న అత్యాచారం

కొత్తకోట: మద్యం మత్తులో వావి వరుసలు మరచిపోతున్నారు. సొంత అన్న కూతురుపై వరుసకు చిన్నాన్న అయిన బాలుడు అత్యాచారం చేసిన సంఘటన గురువారం వనపర్తి జిల్లా కొత్తకోటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మంజునాథరెడ్డి, బాలిక కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీకి చెందిన ఓ వ్యక్తికి ముగ్గురు కుమార్తెలు. ఇతని సొంత తమ్ముడు బాలుడు(17) హైదరాబాద్‌లో ఖాళీగా తిరుగుతూ అక్కడే ఉంటున్నాడు. ఇటీవల కొత్తకోటకు వచ్చిన బాలుడు సొంత అన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెద్ద కుమార్తె (10)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక అరుపులు విన్న తన చెల్లెలు విషయాన్ని ఇరుగుపొరుగు వారికి చెప్పడంతో బాలుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం బాలికను వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అటకెక్కిన 'విద్యా హక్కు'


తాడూరు మండలంలోని అల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

- అసంతృప్తి వ్యక్తం చేసిన హైకోర్టు
- ప్రైవేట్ స్కూళ్లల్లో పేద పిల్లలకు అందని 25శాతం సీట్లు
- ఉచిత నిర్బంధ విద్య అందించడంలో ప్రభుత్వాలు విఫలం

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిరుపేద విద్యార్థులకు ఉచిత, నిర్బంధ విద్యను అందించడం లేదు. విద్యాహక్కు చట్టం–2009 జీఓ 20 ప్రకారం దార్యిద్రరేఖకు దిగువన ఉన్న చిన్నారులకు అన్ని వసతులతో కూడిన విద్యను అందించాల్సి ఉంది. 2009 విద్యా హక్కు ఖచ్చితంగా అమలు చేయాలని ఇది వరకే సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తాజాగా జూన్ 18న రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్నించింది. ఈ చట్టం అమలు ఇప్పుడు ఏదశలో ఉందో పూర్తి వివరాలు తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని కోర్టు ఆదేశిస్తూ రెండు వారాల గడువు ఇచ్చింది. రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. చట్టంలోని 121సీ ప్రకారం ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు 25శాతం సీట్లను కేటాయించాల్సి ఉంది. ఇలా ఎక్కడా జరగడం లేదు. దీనిని ప్రభుత్వం కఠినంగా అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ న్యాయవాది యేగేష్ ప్రజాప్రయోజనాల వ్యాజ్యం కింద కోర్టు విచారించింది. ప్రభుత్వం దాఖాలు చేసిన కౌంటర్‌లో ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు ఉచితంగా ఇస్తున్నట్లు ఎక్కడా లేదని, రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలు ఎంత వరకు వచ్చిందో చెప్పాలని కోరింది. పలు రాష్ట్రాల్లో ఈ చట్టం అమలు జరుగుతున్నా, ఇక్కడ మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫీజులపై నియంత్రణ ఏదీ?

విద్యాహక్కు చట్టం జీఓ 42 ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలని ఉన్నా ప్రభుత్వ నియంత్రణ లేదు. ప్రతి పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, ఫిట్‌నెస్‌లేని బస్సులు నడుపుతున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణకు కమిటీలను ఏర్పాటు చేయాలి. ప్రైవేట్ పాఠశాలల్లో నోట్ బుక్స్, టైబెల్టు, పాఠ్యపుస్తకాలు, స్టేషనరి అమ్మరాదనే నిబంధనలు ప్రైవేట్ పాఠశాలలు ఎక్కడ కూడా అమలు చేయడం లేదు.

పాఠశాలల వివరాలు

నాగర్‌కర్నూల్ జిల్లాలో 156 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 16,677 మంది బాలికలు, 22,930 మంది బాలురు చదువుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 850 వరకు ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో 2.37లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్కో పాఠశాలలో కనిష్టంగా 150 నుంచి గరిష్టంగా 1,500మంది విద్యార్థులు ఉన్నారు. ఈలెక్క ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో 25శాతం సీట్లు అమలు జరిగితే సుమారుగా 10 వేల మంది పేద విద్యార్థులకు విద్యా హక్కు చట్టం కింద చదివే అవకాశం లభిస్తుంది. ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్క సీటు కూడా భర్తీ చేయలేకపోయింది. దీంతో చాలా మంది విద్యార్థులు విద్యకు దూరంగా ఉంటున్నారు. ఇందులో నల్లమల నుంచే ఎక్కువ మంది పిల్లల బడిమానేసిన వారు ఉన్నారు.

చట్టం ప్రధాన లక్ష్యం..

పేద పిల్లలకు ఎలాంటి ఖర్చు లేకుండా విద్యను అందించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం. పేద కుటుంబాలవారు ప్రస్తుతం ఉన్న ఖర్చులను భరించి ప్రైవేట్ విద్యా సంస్థల్లో పిల్లలకు చదివించలేరు. పిల్లలకు చదువులకు అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరించాలి. పాఠ్య, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, యూనిఫాం, రవాణా ఖర్చులను భరించాల్సి ఉంటుంది. దివ్యాంగులైన పిల్లలకు విద్యా అవసర సహాయక సామగ్రి (కళ్లద్దాలు, వినికిడి పరికరాలు, పుస్తకాలు, ఊత కర్రలు) ఇతర ఖర్చులు లైబ్రరీ, ల్యాబోరేటరీ ఫీజులు ప్రభుత్వం సమకూర్చాలి. దీని ద్వారా డ్రాప్‌అవుట్‌ను తగ్గించవచ్చు.

చట్టాన్ని అమలు చేయాలి

ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి. అదేవిధంగా ఫీజుల నియంత్రణకు కమిటీలను ఏర్పాటు చేయాలి. ఎస్సీలకు 10శాతం, ఎస్టీ 4శాతం, బీసీలకు 4శాతం, మైనార్టీ, దివ్యాంగులకు 7శాతం చొప్పున విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలి. చాలా మంది పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి. కనీస మౌలిక వసతులు కల్పించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.

– వర్థం సైదులు,
డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, నాగర్‌కర్నూల్

పేదలకు ఉపయోగం లేదు



మాది రైతు కుటుంబం. వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నాం. మా అబ్బాయిని లింగాలలో ప్రైవేట్ స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్నాడు. ఏడాదికి రూ.20వేల ఫీజు, పుస్తకాలకు రూ.5వేలు, ఇతర ఖర్చులు రూ.5వేల వరకు చెల్లిస్తున్నాం. మా లాంటి మధ్య తరగతి కుటుంబాలకు విద్యా హక్కుచట్టం కింద ఉచిత విద్య అందితే ఏడాదికి సుమారుగా రూ.30వేలకు పైగా మిగులుతాయి. –వెంకటేష్, విద్యార్థి తండ్రి, లింగాల

యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టుల పూర్తి

- ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని మంత్రి జూపల్లి ఆదేశం

గద్వాల రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై మూడు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఇరిగేషన్‌శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి జూపల్లి హైదరాబాద్‌లోని సచివాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న వాటిపై ప్రాజెక్టుల వారీగా స్థితిగతులు, పనుల పురోగతి, భూ సేకరణ, నష్ట పరిహారం చెల్లింపు తదితర అంశాలపై ఆరాతీశారు. ప్రధానంగా జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ప్రాజెక్టుల కింద పనులన్నీ దాదాపుగా చివరి దశలో కొనసాగుతున్నాయని, వాటిని వీలైనంత త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భూ సేకరణ, నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ వంటి సమస్యలపై ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే పాలమూరు– రంగారెడ్డి, నారాయణపేట– కొడంగల్– మక్తల్ ఎత్తిపోతల ప్రాజెక్టులపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కసిరెడ్డి నారాయణరెడ్డి, పర్ణికారెడ్డి, వీరపల్లి శంకర్, వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, ఇరిగేషన్ శాఖ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, నాగేంద్రరావు, సీఈలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, బీవీ రమణారెడ్డి, ఎస్‌ఈ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి


గట్టులో గాంధీ విగ్రహం దగ్గర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

- అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు
- నీతి అయోగ్ ఆధ్వర్యంలో గట్టులో సంపూర్ణ అభియాన్

గట్టు: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని.. గ్రామాల్లో విద్య, వైద్యంతో పాటుగా అన్ని రంగాల్లో ముందుండేందుకు కలిసికట్టుగా పని చేయాలని అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు కోరారు. గురువారం గట్టులో నీతి అయోగ్ ఆధ్వర్యంలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిషనల్ కలెక్టర్, నీతి అయోగ్ ఢిల్లీ ప్రతినిధి శ్రీయనాయర్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. నీతి అయోగ్ ద్వారా దేశంలో వెనుకబడిన 500 మండలాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో గట్టు మండలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 4 నుంచి సెప్టెంబర్ 30 వరకు 6 అంశాలపై అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గర్భిణులు ఎప్పటికప్పుడు వైద్య చికిత్సలు అందించడం, బాలింతలకు పౌష్టికాహారం అందించేలా చూడడం, గ్రామాల్లో 30 ఏళ్లు పై బడిన వారికి వైద్య పరీక్షలను నిర్వహించి బీపీ, షుగర్ వ్యాధులను గుర్తించడం, రైతులకు భూసార కార్డులను అందించడం, మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్‌ను 100 శాతం అందించడం జరుగుతుందని తెలిపారు. వైద్యం,ఆరోగ్యం, వ్యవసాయ రంగాలను అభివృద్ధి పరచేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. మహిళా సంఘాల అభివృద్ధి, కొత్త సంఘాలకు ఆర్థికాభివృద్ధికి కొత్త రుణాలను అందించాలన్నారు.

బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

గ్రామాల్లో బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం పట్ల ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. టీచ్ ఫర్ చేంజ్, భవిష్య భారత్ అనే స్వచ్ఛంద సంస్థలు జిల్లా విద్య అభివృద్ధి చేస్తున్న కృషి పట్ల అభినందించారు. కార్యక్రమంలో నీతి అయోగ్ ఢిల్లీ ప్రతినిధి శ్రీయనాయర్, మహిళా శిశు సంక్షేమ అధికారిణి సుదారాణి, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందునాయక్, సీడీపీఓ కమలాదేవీ, మాజీ ఎంపీపీ విజయ్, జెడ్పీటీసీ బాసు శ్యామల, ఎంపీడీఓ చెన్నయ్య, వైద్యారోగ్యశాఖ అధికారులు, అంగన్‌వాడి టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన విదేశీ వనిత

చారకొండ: దేశంలో పలు ప్రాంతాల్లో పర్యటన చేస్తున్న సందర్భంగా మండలంలోని జూపల్లి ప్రభుత్వ పాఠశాలను గురువారం యూఎస్‌ఏకు చెందిన విదేశస్తురాలు నైనా రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి విమలాదేవి ఆధ్వర్యంలో సందర్శించారు. గ్రామాల్లో వాతావరణం, పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల స్థితిగతులపై వివరాలను సేకరించారు. ఈమె హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని విషయాలను విద్యార్థులతో చర్చించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి నైపుణ్యంతో ఆంగ్ల విద్యను పెంపొందించుకుని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఝాన్సీరాణి, నాయిని పరంజ్యోతి, ఉపాధ్యాయులు అమరేందర్, నారాయణ, విజయలక్ష్మి, హరిలాల్, తదితరులు ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న నైనా